


# అమెరికులాసా కథ – 204

## "ఎచ్చట చూచిన అచ్చటనే కలదు బచ్చలి" కథ

**మన ఉగాది, చైత్ర మాసం** వగైరాలు రాగానే మార్చ్, ఏప్రిల్ నెలలలో మా అమెరికాలో మంచు కరిగిపోతుంది. చలికి చచ్చిపోయినట్టు నటించిన మొక్కలు కొన్ని మళ్ళీ కిచ కిచలాడుతూ లేచి కూచుంటాయి. మేము కూడా ఊలు స్వెట్టర్లు విప్పేసి ఖాకీ నిక్కర్లు వేసుకుని తోటపనిలో పడతాం. ఆ పనిలో మొదటి పని మంచి మొక్కల మధ్య గడ్డి పెరిగిందా లేక గడ్డి మొక్కల మధ్య మంచి మొక్కలు మేమూ ఉన్నాం అని సగర్వంగా తలెత్తుకున్నవి ఏమైనా ఉన్నాయా అని లెక్కలు వేసుకోవడం. ఈ సారి ముందుగా గర్వంగా తలెత్తుకుని నిలబడ్డది నిజంగా చలికాలం మంచులో కూడా అలాగే ఉన్నది మా నిలువెత్తు తాటిచెట్టు. మొన్న ఒక రోజు పొద్దున్నే సూర్యోదయం ఎండకి తన నీడని మా పడమటి వేపు ప్రహారీ గోడమీద పడగా చూసి నేను ఫొటో తీస్తూ ఉండగా నా నీడ కూడా పడిన ఫొటో…అనగా ఈ ఏటి తోటలో నారాజు ఫొటో..ఇదిగో పక్కనే. అప్పటికి ఆ మూలనే ఉన్న అరటి మొక్కలకీ, ఇంకా మిగతా వాటికి ప్రాణం రాలేదు. మరొక వారం తిరగానే చూద్దును కదా…మా పెగీ మార్టిన్ గులాబీ విరగబూసి పాటలు పాడడం మొదలుపెట్టింది.



ఆ పెగ్గీ మార్టిన్ అనే తీగె గులాబీ చాలా స్పెషల్…మా తోట సింహద్వారం చుట్టూ అల్లుకుని ఉంటుంది. చలికాలం లో అదీ, మా తోటలో ఉన్న మిగతా పది, పదిహేను రకాల పాతిక పైగా గులాబీలు చలికి కాస్త నీరసపడతాయేమో కానీ బతికే ఉంటాయి. వసంత కాలం రాగానే పువ్వు పూస్తాయి కానీ ఈ దిక్కుమాలిన అమెరికాలో పువ్వులు చూచుటకు మాత్రమే బావుండును కానీ…అస్సలు సువాసన వెయ్యనే వెయ్యవు. ఆ మాటకొస్తే మనుషులు కూడా అంతే!. ఎందుకో మరి. "ఏమిటా వెధవ పని" అని మా క్వీన్ విక్టోరియా కోప్పడినా, అప్పుడప్పుడు నేను కునేగా మరికొళుందు సెంట్ ఆ పువ్వుల మీద కొట్టి వాసన చూసి ఆనందం నటిస్తూ ఉంటాను! అమెరికాలో సహజమైన సువాసన లేకనే అందరూ రకరకాల పెర్ ఫ్యూములూ, సెంట్ లూ, కలోన్ లూ అలా కొట్టుకుంటూ ఉంటారు అనుకుంటాను.



ఇక ప్రతీ ఆదివారం మా ఇంటికి వచ్చి మాతో గడిపే మా మూడేళ్ళ పెద్ద మనవడికీ, వీలున్నప్పుడల్లా డాలస్ నుంచి వచ్చే మా ఇద్దరు మనవరాళ్ళకీ మా తోటలో ఆడుకోవడం అంటే మహా సరదా. ఇంట్లో అడుగుపెట్టగానే 'అమ్మమ్మా, తాతా..తోటలోకి పద" అని దారితీసి అక్కడ వాళ్ళ కోసం కొన్న చిన్న నీళ్ళ డబ్బా తో కుండీలో మొక్కలకి నీళ్ళు పొయ్యడం, ఈ మధ్యనే కొన్న క్రికెట్ బేట్, బంతులతో ఆటా,

హడావుడీ ఒక సరదా అయితే ఐదేళ్ళ మా పెద్ద మనవరాలు మట్టి తవ్వి మొక్కలు వెయ్యడం కూడా చేస్తుంది. ఆ సరదా ఫొటోలు రెండు ఇక్కడ పెట్టాను. ఇక మా రెండో మనవడు కేశవ్ ఇంకా వాడి చక్రాల బండి..స్ట్రోలర్ లో కూచుని చోద్యం చూస్తూ ఉంటాడు.








ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. మా మొదటి పెద్ద కూరగాయల మడి..బతికుంటే బలిసాకు సామెతకి నూటికి నూరు పాళ్ళు ఉదాహరణగా కిందటేడు పడిన విత్తనాలకీ, మట్టిలో ఎక్కడో దాక్కుని చలికి చావకుండా మళ్ళీ ప్రాణం పోసుకున్న చిక్కుడు, కాకర, బచ్చలి, కర్వేపాకు, చేమ దుంపలు ఎట్ సెటరాల గురించి చెప్పి తీరాలి. ఎందుకంటే వాటిల్లో ఏది కాకరో. ఏది చిక్కుడో, మధ్యే మధ్యే పెద్ద పెద్ద ఆకులతో ఇంకా అది బూడిద గుమ్మడో. ఆనపో, బీర పాదో తెలియని పరిస్థితిలో ఉంది. లక్కీగా అవి పరపరాగ సంపర్కం చేసుకుని బీర, కాకర కలిసిపోయి బీకర కూర, ఆనప, చిక్కుడు సంపర్క బలంతో సొరక్కాడా లాంటి సంకర కూరలు కాయవు కాబట్టి బతికి పోయాం. తమాషా ఏమిటంటే గుబురు గుబురుగా ఉండే ఈ మొక్కల అన్నింటి మధ్యా ఓ కుందేళ్ళ జంట కాపురం పెట్టుకున్నాయి. నీళ్ళు పొయ్యడానికి నేను అక్కడికి వెళ్ళగానే అవి కాపురం చెయ్యడం మానేసి, బుర్రలు పైకెత్తి నన్ను చూసి తుర్రున పారిపోతాయి. మర్నాడు అదే సమయానికి అదే సీను....అంటే, నేను మొక్కలకి నీళ్ళు పోసేసి ఇంట్లోకి వెళ్ళగానే అవి మళ్ళీ వాటి గూటికి చేరి సంసారం మొదలుపెడతాయి అనమాట!. ఇదేదో సరదాగానే ఉన్నా, తీరా వంగ, దోస లాంటివి కాపుకి వచ్చినప్పుడు ఆ కుందేళ్ళ జంట వాటిని సగం సగం కొరికి పారేసినప్పుడు భలే ఒళ్ళు మండుతుంది. నాకు ఒళ్ళు మండినప్పుడు మా క్వీన్ విక్టోరియా కిచ కిచా నవ్వుతుంది.


ఇక రెండో కూర గాయల మడిలో వేసిన దోస, పొట్ల, మూడో మడిలో వంగ, మిరప, బెండ వగైరాలు, నాలుగో చోట దొండ, అక్కడా, ఇక్కడా వేసిన టొమేటో, తోటకూర వగైరాలు ఇంకా సెల్ఫీ ఫొటోలు తీసుకునే స్థాయికి ఎదగ లేదు. మధ్యే మధ్యే వేసిన దానిమ్మ, నిమ్మ, కమలా ఫలాలు, మూల కూచున్న అరటీ కాపు కాయడానికి ఐదారు నెలలు పడుతుంది. కూరగాయల పంటతో కడుపు ఆటోమేటిక్ గా నిండదు. దానికి మా క్వీన్ విక్టోరియా వంట చలవ కూడా కావాలి. మాకు కావలసిన నాలుగు వంకాయలూ, పది బెండకాయలూ కాసినా, మోపులు కొద్దీ శాకంబరీ దేవీ ప్రసాదం కాసినా ఈ దేవీ కటాక్షం లేనిదే ఎంత కాపు కాసినా ఉపయోగం లేదు. ఆలి అలిగినప్పుడు మిగిలిపోయిన కూరగాయలు మా నెల వారీ సాహితీ సదస్సులకి కర్వేపాకు, బచ్చలి, కాకర, దోస "లంచం" ఇస్తాం అనగానే పది మంది పైగా వస్తారు. లేదా, గుడికి వెళ్ళి అక్కడ భక్తులకి పంచిపెట్టెయ్య వలసిందే.

వీటిల్లో ఒక్క చేమ దుంపలకే వేరే రకం పిట్ట కథ ఉంది. నేను ఎప్పుడైనా నాకు ఇష్టమైన, ఆవిడకి అంతగా ఇష్టం లేని చేమ దుంపల ముద్ద కూర ఆవిడ చేత బతిమాలి చేయించుకుందాం అనుకుని పది, పదిహేను దుంపలు కొనుక్కుని పట్టుకొచ్చానే అనుకోండి. నా మీద కోపం లాంటి అనివార్య కారణాల వలన అవి అలాగే సంచీలో పది రోజులు మగ్గిపోయాక, వాటి సనాతన ధర్మం ప్రకారం కొన్ని కుళ్ళి పోగా మరికొన్నింటికి మొలకలు వస్తాయి కదా. అవి కూరకి పనికి రావు కదా. అంచేత ఆ మొలకల చేమ దుంపలని తోటలో ఏదో ఒక

మడిలో పాతేస్తాను. అంతే. కొన్నాళ్ళకి అవి పెద్ద పెద్ద ఆకులతో సొగసుగా ఎదుగుతాయి. ఒక ఏడాది దాటాక ఓపిక ఉన్నప్పుడు తవ్వితే సొంత తోటలో మనకి సరిపడా చేమ దుంపలు భూమిలో దొరుకుతాయి అనమాట!

ఇక పూల మొక్కలు అలా కాదు. మనం కాస్త జాగ్రత్తగా వేస్తే ఒక సారి నిలదొక్కుకున్నాక పాపం అలా వాటి పని అవి చేస్తూ పువ్వులు పూస్తూనే ఉంటాయి. వాసన మాట ఎలా ఉన్నా చూడడానికి తోట అందంగా ఉంటుంది. అంచేత మా తోటలో ఐదు మడులు కేవలం పువ్వుల మొక్కల కోసం కేటాయించాను. గొప్పలు చెప్పుకోవడం కాదు కానీ, గులాబీలే కాక, పసుపు, ఎరుపు చంద్రకాంతాలు, అమెరికా నంది వర్ధనం, రంగు రంగుల మందారాలు, బంతి, చేమంతి, పెద్ద గన్నేరు, బిళ్ళ గన్నేరు, మన మల్లె మొగ్గలు, బొడ్డు మల్లె, కనకాంబరాలు, లాంటానా, బెగోనియా మొదలైన రకరకాల అమెరికన్ పువ్వులు, మెట్ట తామెర, సీజన్లో పూసే గ్లాడియోలాలు, లిల్లీ పువ్వులు..అవును మన బోగన్ విలియా తో సహా ..ఇలా అన్నీ తలో కాసిన్నీ వెయ్యడం ఒక ఎత్తు అయితే ఈ ఏడు అనుకోకుండా ఒక చిన్న ప్రయోగం చేశాను. ఎందుకంటే..మొన్నటి శీతాకాలం లో చలికి, తుఫానుకీ మా రెండు గులాబీ వరసల మధ్య ఉండే వాటర్ ఫౌంటెన్ బిగుసుకు పోయి బీటలు వేసింది. అంచేత దాన్ని తీసి అవతల పారేసి, ఆ ఐదారడుగుల గుండ్రం నీళ్ళ పాండ్ లో మట్టి నింపేసి జినియా విత్తనాలు చల్లేశాను. చెప్పొద్దూ.....కొత్త బిచ్చగాడు పొద్దెరగడు అన్నట్టు అవి విజృంభించి మూడు అడుగులపైనే ఎదిగి రంగు రంగుల పూలతో విరగబూశాయి. కావాలంటే ఆ ఫొటో చూడండి. గులాబీల వరస, మధ్యలో వందలాది జినియాలు, ముందు కుండీలలో కనకాంబరాలతో సహా మిగతా పువ్వుల మొక్కలు, వెనకాల దాక్కున్న మల్లె మొక్కలు...మధ్యలో మన సెల్ఫీ....వావ్..కదా!. ఈ సెల్ఫీ కోసం నా వీపు పువ్వుల కేసీ, మొహం గోడ వేపూ పెట్టవలసి వచ్చింది, ప్చ్!

అయితే ఇక్కడ ఏ మాటకామాటే చెప్పుకోవాలి. రోజూ, మరీ ముఖ్యంగా పౌర్ణమి రోజున చంద్రుడు ఆకాశంలో ఆటునుంచి ఇటువేపు అలా ప్రయాణం చేస్తూ ఉండగా ఈ పువ్వుల మొక్కలలో చంద్రకాంతాలు, బిళ్ళ గన్నేరు చూసినప్పుడల్లా నేను కాకినాడ వెళ్ళి పోతాను. కాస్త మనస్సు చివుక్కు మంటుంది. ఎందుకంటే అక్కడ మా ఇంట్లో ఈ చంద్రకాంతాలు విచ్చల విడిగా ఉండేవి. ఒక సారి నేను వెళ్ళినప్పుడు మా అమ్మ ఆ విత్తనాలు కొన్ని ఇచ్చి 'ఒరేయ్. ఇవి అమెరికాలో బతుకుతాయో లేదో, వేసి చూడు" అని ఇచ్చిన విత్తనాలే ఈ నాటికీ బతికి బయటకట్టినవి. మరి మనస్సు చివుక్కుమనదూ? ఇక ఈ బిళ్ళ గన్నేరు విషయానికి వస్తే అవి ఇండియాలో ఎక్కడ పడితే అక్కడ, మరీ ముఖ్యంగా మరుగు దొడ్లలోనూ, మురికి కాలవల పక్కనా ఎవరూ వెయ్యకుండానే పెరిగి పువ్వులు పూస్తాయి. కానీ మరి ఈ దిక్కుమాలిన అమెరికాలో మూడంగుళాల మొక్క మూడు డాలర్లు పెట్టి కొనుక్కుని మనింట్లో వేసుకోవాల్సి వచ్చిందీ అంటే మరి మనస్సు చివుక్కు మనక ఇంకేమంటుందీ? ఇలా సాండ్ బాగ్ జాస్మిన్ అనే మల్లె మొక్క గురించీ...కెసాండ్రా అనే కనకాంబరాల గురించీ చైనా, అమెరికా పేర్లతో చెలామణీ అయే రకరకాల కూరగాయలు, పూల మొక్కల గురించే కాదు, పుదీనా, కొత్తి మీర, బేసిల్ లాంటి సేలడ్ లో వేసుకునే ఆకులు, అలములు గురించీ, వాటి "ఆర్గానిక్ అవతారాలు" గురించీ చాలా కథలే చెప్పగలను.



ఇక అన్నింటికన్నా మమ్మల్ని తెగ ప్రేమించేది ఆ బచ్చలి..అనగా మలబార్ స్పినాచ్ లేదా ఏషియన్ స్పినాచ్..ఎర్రదీ, ఆకుపచ్చదీ...ఏ రాయి అయితేనేం... ..అది ఉంది చూశారూ...ఎక్కడికి పడితే పాకి పారెయ్యడమే దాని సనాతన ధర్మం. పైగా వాటికి మన మీద కసి కూడా ఎక్కువే. ఒక సారి ఆ బచ్చలి ఆవేశపడి గోడ వారగా అందం కోసం వేసిన ..అవును..జినియాలే...వాటిని ఎక్కి తొక్కి పారేస్తే నాకు కూడా ఆవేశం వచ్చి, ఒళ్ళుమండి దాన్ని కూకటి వేళ్ళతో పెకలించి పారేశాను...అని అనుకున్నాను. ఆ వారాంతం రెండే రెండు రోజులు ఊరికి వెళ్ళి తిరిగి వచ్చే సరికి నేను పీకిన చోటనే కాక పీకని చోట కూడా కనిపెట్టేసి పై పైకి పాకి ఇంటి కప్పు మీద సెటిల్ అయిపోయింది. అందుకే ఇందుగలదందందేగలదు..ఎచ్చట చూచిన అచ్చటనే కలదు బచ్చలి అన్నాడు భాష్యకారుడు!

"ఏడిశాడు. ఎవడా చచ్చు భాష్యకారుడు గాడు. బచ్చలి పప్పు, కందా బచ్చలి, టొమేటో తో బచ్చలి, బచ్చలి ఆవ పెట్టిన పులుసు, బచ్చలి రోటి పచ్చడి, బచ్చలితో నీ పిండాకూడు..సారీ, సారీ నా పిండాకూడూ..అబ్బబ్బా. చెయ్యలేక చస్తున్నాను" – వాపోతూ నాలిక్కరిచేసుకుంది మా క్వీన్ విక్టోరియా...

**COMMENTS**